నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 1 జూలై 2024 | KARIMNAGAR

వచ్చే ఏడాది మార్చి వరకు
## 'స్మార్ట్‌సిటీ' పథకం పొడిగింపు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 30 : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్‌సిటీ పథకం గడువును వచ్చే మార్చి వరకు పొడిగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కరీంనగర్ నగరపాలక సంస్థలో 2018 మొదలైన ఈ పథకం మొదట ఐదేళ్ల పరిమితితోనే ఇచ్చారు. కాగా, ఈ పథకంలో రూ.వెయ్యి కోట్ల మేరకు ప్రతిపాదనలపై అడ్మినిస్ట్రేషన్ మంజూరీ కూడా వచ్చింది. కాగా, వీటిల్లో ఇప్పటికే రూ.750 కోట్లకు పైగా పనులు పూర్తయ్యాయి. నగరంలో స్మార్ట్‌సిటీ కింద మరో రూ.250 కోట్లకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంది. వీటికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావాల్సి ఉంది. ఈ పథకం 2023తోనే ముగియగా, గతేడాది రాష్ట్ర ప్రభుత్వ విన్నపం మేరకు 2024 జూన్ 30 వరకు పొడిగించారు. అయితే, దేశంలో స్మార్ట్‌సిటీ కింద ఎంపికైన నగరాల్లో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండడంతో 2025 మార్చి వరకు ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించినట్లు అధికారులు తెలిపారు. దీంతో నగరపాలక సంస్థ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం దక్కింది.

# గనుల వేలంపై పోరుబాట

## సింగరేణి రక్షణకు కార్మిక సంఘాల యుద్ధభేరి

- ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ మినహా మెజార్టీ యూనియన్లు సై
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ఉద్యమం
- ఇప్పటికే టీబీజీకేఎస్ కార్యాచరణ
- నేటి నుంచే దశలవారీగా నిరసనలు
- బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు
- 9న ఖనిలో మహాధర్నాకు కేటీఆర్ రాక



సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియపై కార్మిక సంఘాలు పోరుబాట పట్టాయి. ప్రైవేట్‌కు కట్టబెడితే దాదాపు 40 వేల మంది కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధభేరి మోగిస్తున్నాయి. గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ, మరో జాతీయ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీ ఇప్పటివరకు తమ వైఖరిని తెలియజేయకపోగా, మిగతా సంఘాలు ఉద్యమానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే స్పష్టమైన కార్యచరణ ప్రకటించిన టీబీజీకేఎస్, బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతుతో నేటి నుంచే పోరాడనున్నాయి. సోమవారం నుంచి గనులపై దశలవారీగా నిరసనలు తెలుపుతామని, 9న ఖనిలో మహాధర్నాకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని యూనియన్ పేర్కొంది.

– గోదావరిఖని, జూన్ 30

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిపై అనేక కుట్రలు చేస్తున్నది. బొగ్గుబ్లాకులను వేలం వేసి ప్రైవేట్‌కు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో సింగరేణి కార్మిక సంఘాలు కన్నెర్రజేస్తున్నాయి. ఒక్కసారిగా పోరుబాటలోకి వెళ్లిపోయాయి. బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే దాదాపు 40వేల మంది కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం పొంచి ఉండగా, మెజారిటీ కార్మిక సంఘాలు ఆందోళనలకు సిద్ధమయ్యాయి. గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న ఏఐటీయూసీ ఇప్పటివరకు స్పష్టమైన ప్రణాళిక లేకుండా, తమ వైఖరిని తెలియజేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. మరో జాతీయ కార్మిక సంఘం కాంగ్రెస్‌కు అనుబంధమైన ఐఎన్‌టీయూసీ సైతం వేలానికి వ్యతిరేకమని చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఆ పార్టీ వైఖరి ఎలా ఉంటుందో తెలియకపోవడంతో ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నది. ఇదిలా ఉంటే రెండ్రోజుల కింద శ్రీరాంపూర్‌లో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌తోపాటు ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ ఇతర సంఘాల ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 3న హైదరాబాద్ సోమాజిగూడలో ప్రెస్‌క్లబ్‌లో కార్మిక సంఘాల నాయకులు, మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు.

### స్పష్టమైన వైఖరితోనే బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్


సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని బీఆర్‌ఎస్ పేర్కొంటున్నది. అధికారంలో ఉన్న పదేండ్లలో సింగరేణి కార్మికుల అనేక హక్కులు కల్పించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కింది. ఆంధ్రా వలసవాదుల కుట్రలో తీవ్రంగా నలిగిపోయిన సంస్థను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లి కోల్ ఇండియాలో లేని అనేక హక్కులు కల్పించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కింది. బీఆర్‌ఎస్ హయాంలో ప్రగతి బాటలో పయనించిన సింగరేణి సంస్థకు సంబంధించిన బొగ్గు బ్లాక్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలం వేయాలనే కుట్రలను సహించేది లేదని తేల్చి చెప్పుతూ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది. ఇదిలా ఉంటే సింగరేణి సంస్థలో దశాబ్ద కాలానికిపైగా గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ కార్మికుల రక్షణే ధ్యేయంగా ముందు సాగుతామని పేర్కొంటున్నది. ఈ క్రమంలో బొగ్గు బ్లాక్‌లకు వ్యతిరేకంగా కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ముందుకు సాగుతామని ప్రకటించింది.

### నేటి నుంచే పోరుబాట

సింగరేణిని కాపాడుకునేందుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోరాటానికి సిద్ధమైంది. సోమవారం నుంచి సింగరేణి వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. 1న గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయడంతో పాటు గని అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని, 3న అన్ని ఏరియాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6న సింగరేణిలోని అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, జీఎంలకు వినతిపత్రాలు అందజేత, 9న గోదావరిఖని పట్టణంలో మహాధర్నా ఉంటుందని, దీనికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని మిర్యాల రాజిరెడ్డి తెలిపారు.

# వేలాన్ని అడ్డుకుంటాం

- బొగ్గు బ్లాకులు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లనిచ్చే ప్రసక్తే లేదు
- సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారితే ఊరుకునేది లేదు
- మరో ఉద్యమాన్ని చేపడుతాం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టి బుద్ధి చెబుతాం
- సింగరేణి కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయం
- టీబీజీకేఎస్ నూతన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి
- 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ



*'సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. ప్రైవేట్‌కు అప్పనంగా కట్టబెట్టి సంస్థ మనుగడను, 40వేల మంది కార్మికుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చాలని చూస్తున్నది. ఇటీవలి పరిణామాలు చూస్తే దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సపోర్టు చేస్తున్నట్లు కనిపిస్తున్నది. మరో పోరాటం చేసైనా సరే బొగ్గు బ్లాకులు వేలాన్ని అడ్డుకుంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టి బుద్ధి చెబుతాం' అని టీబీజీకేఎస్ నూతన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వేలానికి వ్యతిరేకంగా సోమవారం నుంచి పోరుబాట పడుతున్నామని, దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్న ఆయన, ప్రైవేట్ వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లో తట్ట బొగ్గు కూడా ఎత్తకుండా అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. - గోదావరిఖని, జూన్ 30*

### నమస్తే: బొగ్గు బ్లాకుల వేలంతో జరిగే నష్టమేంటి..?

ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణి మరో వందేళ్లపాటు బొగ్గు వెలికి తీసే అవకాశాలు ఉన్నాయి. కార్మికుల ఉద్యోగాలకు ఢోకాలేదు. బొగ్గు బ్లాకులను ప్రైవేట్‌కు అప్పగిస్తే బొగ్గు నిలువలు వేగంగా తగ్గిపోయి, సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోతుంది. సింగరేణిలో ఇప్పటికే కార్మికుల సంఖ్య తగ్గిపోతున్న క్రమంలో బొగ్గు బ్లాకులు ప్రైవేట్‌పరమైతే పర్మినెంట్ కార్మికుల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంటుంది. జాబు గ్యారంటీ లేకుండా పోతుంది. కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులను నియమించి అతి తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టి చాకిరి చేయిస్తారు.

### నమస్తే: వేలంపై మీ వైఖరి ఎలా ఉండబోతున్నది?

సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అంటగట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీనికి రాష్ట్రంలోని కాంగ్రెస్ సపోర్టు చేస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇటీవల బొగ్గు బ్లాక్‌ల వేలంపై కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరై, వేలాన్ని వ్యతిరేఖిస్తున్నట్లు లెటర్ ఇచ్చినట్లు చెబుతున్నరు. నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకించినట్లయితే వేలానికి సంబంధించిన మీటింగ్‌కు హాజరయ్యే లెటర్ ఇవ్వాలా..? మరోజు ఇవ్వవచ్చు కదా..? ఈ విషయం చాలా అనుమానాలకు తావిస్తున్నది. ఈ కారణంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సింగరేణిలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వెళ్లకుండా అడ్డుకొని తీరుతాం.

### సింగరేణి ప్రధాన సమస్యలు ఏమిటి..? పరిష్కారానికి ఏం చేయబోతున్నారు?

సీమాంధ్ర ప్రభుత్వాల హయాంలో సింగరేణి సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. తెలంగాణ ఏర్పాటుతో సింగరేణి సంస్థ ఒక నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించేలా ముందుకు సాగుతుంది. సీమాంధ్రలో హయాంలో కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, ఇతర రాష్ట్రాల్లో గనుల నిర్వహణ తెలంగాణ ఏర్పడిన అనంతరమే జరిగాయి. ఇప్పుడు సింగరేణి పరిస్థితి మళ్లీ పాత పద్ధతిలోకి వెళ్లే అవకాశం ఉంది. బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలం పేరుతో సింగరేణి సంస్థకు సంబంధించిన గనులను ప్రైవేట్ వ్యక్తులకు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నది. దీనిని గట్టిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. సంస్థ మనుగడను కాపాడేందుకు పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎక్కువగానే ఉంది. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిలో ప్రైవేట్ వ్యక్తులు ఒక తట్ట బొగ్గు కూడా ఎత్తకుండా అడ్డుకునే విధంగా ముందుకు సాగుతాం. సంస్థలో ఇంకా అనేక సమస్యలున్నాయి. వాటిపై ఎప్పటికప్పుడు ప్రతిపక్ష కార్మిక సంఘంగా ఉండి పోరాటం చేస్తాం.

### గతంలో బీఆర్‌ఎస్‌తో అనుబంధంగా ఉన్న మీరు ఇప్పడేం చేయబోతున్నారు?

వాస్తవంగా ఏ కార్మిక సంఘం ఏడుగురు సభ్యులతో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు వారు ఎవరికి అనుబంధంగా ఉంటామనే విషయాన్ని తెలియజేయాల్సిన అవసరం లేదు. తెలంగాణ ఏర్పాటుకు ముందు నుంచి బీఆర్‌ఎస్‌తోనే టీబీజీకేఎస్ కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ సింగరేణి సంస్థను అదోగతి పాలు చేయడానికి చూస్తున్నట్లుగా అర్థమవుతోంది. ఈ క్రమంలో టీబీజీకేఎస్ బీఆర్‌ఎస్ పార్టీతోనే అనుబంధం కొనసాగించాలని భావిస్తున్నది. తాము టెక్నికల్‌గా ఏ పార్టీకి అనుబంధం లేనప్పటికీ వాస్తవానికి మాత్రం బీఆర్‌ఎస్‌తోనే అనుబంధంగా ఉండాలని భావిస్తున్నాం.

## డాక్టర్స్ డే శుభాకాంక్షలు
An ADVT Special Feature



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ ఎల్ రమణ

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీఆర్‌ఎస్ సముద్రం లాంటిది
- అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కేసీఆర్‌ది చెరగని ముద్ర
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- నేటి కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరు
- విజయవంతం చేయాలని పిలుపు

జగిత్యాల టౌన్, జూన్ 30 : బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చినా.. అండగా ఉంటామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భరోసా ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణమండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ ఎల్ రమణ, రాజేశం గౌడ్‌తో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఫలితాల దృష్ట్యా కార్యకర్తలకు మనోస్థైర్యం ఇవ్వడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారని తెలిపారు. పార్టీ సముద్రం లాంటిదని.. అధికారం బీఆర్‌ఎస్ పోగానే కొందరు నాయకులు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వదిలి వెళ్లిపోతున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారనని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో ముందుకెళ్తామని, వ్యక్తిగత అవసరాల కోసం పార్టీ మారిన వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ, ఉద్యమ పార్టీ బీఆర్‌ఎస్ 14ఏండ్లు ఎన్నో అటుపోట్లు చూసిందని.. పదేండ్లు అధికారంలో ఉందని.. జగిత్యాల ఎమ్మెల్యే పోయినంతా మాత్రాన పార్టీకి నష్టమేమీ లేదన్నా రు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, సమావేశానికి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అల్లాల దామోదర్‌రావు, వొల్లెం మల్లేశం, గంగారెడ్డి పాల్గొన్నారు.



రంగపేట గ్రామంలో ధ్వంసమైన శిలాఫలకం

## నిన్న ప్రారంభించిన్రు.. నేడు పగలగొట్టిన్రు..

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయి. పాత, కొత్త నాయకులు వేర్వేరు గ్రూపులు ఏర్పడ్డారు. ఇందుకు నిదర్శనమే ఇల్లంతకుంట మండలం రంగపేటలో నూతన గ్రామ పంచాయతీ భవన శిలాఫలకం ధ్వంసం కావడం. వివరాల్లోకి వెళ్తే.. రంగపేట గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. అయితే, గ్రామంలో జీపీ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వస్తున్నారని కొందరికి మాత్రమే సమాచారం ఇచ్చారు. దీంతో సమాచారం అందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెల్లాసరేసరికి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రూపులుగా ఏర్పడడం, పార్టీలో అంతర్గత కలహాలతో శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

- ఇల్లంతకుంట, జూన్ 30

## రాజన్న కోడెల సంరక్షణకు చర్యలు

వేములవాడ, జూన్ 30: వేములవాడ రాజన్న కోడెల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సీఎం ఓఎస్డీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాజన్న ఆలయ గోశాలను తనిఖీ చేశారు. అనంతరం ఆలయ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం ఆదేశాల మేరకే రాజన్న గోశాలను తనిఖీ చేశానని తెలిపారు. గతంలో గోశాల ఫెడరేషన్ ద్వారా గోశాలలకు కోడెలు ఇచ్చే విధానంతో అక్రమాలు జరిగాయని గుర్తించి, ప్రస్తుతానికి భక్తులు సమర్పించిన కోడెలను ఎవరికీ ఇవ్వడం లేదన్నారు. దీంతో గోశాలలో 400ఉండాల్సిన కోడెల సంఖ్య 1500కి చేరిందన్నారు. ఇకనుంచి నూతనంగా వచ్చే కోడెలను 21రోజులు ప్రత్యేకంగా వేరేచోట ఉంచి, వాటి ఆరోగ్య పరిస్థితులను చూశాకే మిగతా వాటితో కలుపనున్నట్లు చెప్పారు. గోశాలలో అవసరమైన ఏర్పాట్ల కోసం ఇటీవలే రూ.1.11 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. అవసరమైన వైద్య సిబ్బందిని కూడా నియమించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రాజన్న ఆలయ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇక్కడ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు మహేశ్, తదితరులు ఉన్నారు.

# విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్ట్

ముస్తాబాద్, జూన్ 30: పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించి.. దాడికి పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూక్యా గురుబాబు అలియాస్ బాబు ఈ నెల 25న అర్ధరాత్రి తన డ్రైవర్ ప్రశాంత్‌తో కలిసి రామలక్ష్మణపల్లి శివారులోని మానేరువాగులో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో నింపుకొని దుబ్బాకకు బయలుదేరాడు. ఈ క్రమంలో వీరి ట్రాక్టర్‌ను నామాపూర్ చెరువు కట్ట మీద పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ ప్రశాంత్ సమాచారం మేరకు గురుబాబు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నాడు. 'నా ట్రాక్టర్ పట్టుకోవద్దు.. నాకు అడ్డురావద్దు'' అంటూ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సత్యనారాయణను బెదిరించి గాయపర్చాడు. వెంటనే తన డ్రైవర్‌తో కలిసి అక్కడి నుంచి పారిపోయాడు. కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం నామాపూర్ శివారులో గురుబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కాగా, వివిధ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు గురుబాబుపై 21 కేసులు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఓ మర్డర్ కేసులో రౌడీ షీట్ కూడా ఓపెన్ చేశామని తెలిపారు.

## గడువులోగా పనులను పూర్తి చేస్తాం

మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 30 : కరీంనగర్ స్మార్ట్ సిటీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 80 శాతం వరకు పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 31లోగా స్మార్ట్ సిటీ కింద చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేస్తామని తెలిపారు.

### రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డి

వేములవాడ, జూన్ 30: వేములవాడ రాజన్న ఆలయ ఇన్‌చార్జిగా ఈవో వినోద్‌రెడ్డిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణప్రసాద్ సెలవులపై వెళ్లగా ఆర్జేసీ రామకృష్ణ ఆదివారం వరకు ఇన్‌చార్జిగా ఈవోగా పని చేశారు. ఆషాఢ మాసం బోనాలు సమీపిస్తున్నందున దీనికి ప్రత్యేక అధికారిగా ఉన్న రామకృష్ణ వాటి బాధ్యతను చూసుకోవాల్సి ఉన్నందున ఆయన ఆదివారం రిలీవ్ అయి హైదరాబాద్ చేరుకోనున్నారు. అయితే కృష్ణప్రసాద్ తనకు ఆరోగ్యం సహకరించడం లేదంటూ మరికొంత కాలం సెలవు కావాలని కోరిన నేపథ్యంలో సికింద్రాబాద్ గణేశ్ దేవాలయం ఈవోగా పనిచేస్తున్న వినోద్‌రెడ్డిని ప్రస్తుతం వేములవాడ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



















